

మహేశ్ శెట్టి తిమరోడికి బెయిల్

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ పట్ల అనుచితంగా మాట్లాడిన ఆరోపణలతో అరెస్టు అయిన మహేశ్‌శెట్టి తిమరోడికి ఉడుపి అదనపు సివిల్ కోర్టు నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ధర్మస్థలలో సౌజన్య హత్యకేసులో మహేశ్‌శెట్టి తిమరోడి పోరాటం చేస్తున్నాడు. పోలీస్ కస్టడీలో ఉన్న తిమరోడిని కోర్టు ముందు శనివారం హాజరు పరిచారు. ఆయన తరఫున విజయవాసు పూజారి వాదనలు వినిపించారు. నిబంధనలతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది.

9 రోజులు, 71 గంటలపాటు అసెంబ్లీ కార్యకలాపాలు

● స్పీకర్ యూటీ ఖాదర్



బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శాసనసభ వర్షాకాల సమావేశాల 9 రోజులు, 71 గంటలపాటు కార్యకలాపాలు సాగాయని స్పీకర్ యూటీ ఖాదర్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొలిరోజున సంతాప తీర్మానాలు కొనసాగాయని, ఇటీవల 18మంది బీజేపీ శాసనసభ్యులపై వేసిన సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్రపతి, గవర్నర్ అంగీకరించిన పలు బిల్లులను ఆమోదించామన్నారు. ద్రవ్య వినియోగ బిల్లుతోపాటు 39 బిల్లులు సభ ముందుకు రాగా 37 బిల్లులను అంగీకరించామన్నారు. శాసనసభలో సవరణలతో అంగీకరించబడి పరిషత్‌లో తిరస్కరణకు గురైన కర్ణాటక సౌహార్ద్ర సహకార బిల్లును అంగీకరించామన్నారు. నిబంధన 60కింద ఇచ్చిన మూడు వాయిదా సూచనలు, 69కి బదిలీ చేసి మొత్తం 7 సూచనలను 69వ నిబంధన కింద చర్చించామన్నారు. 35 పిటీషన్లు సభకు ఒప్పించారన్నారు. మొత్తం 2306 ప్రశ్నలు స్వీకరించామని, అందులో 2199 ప్రశ్నలకు అంగీకారం అయ్యిందన్నారు. సభలో సమాధానం చెప్పాల్సిన 135 ప్రశ్నలకుగాను 128కు, లిఖితపూర్వకమైన 2064 ప్రశ్నలపైకి 1662 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారన్నారు. 351 నిబంధనకింద 220 సూచనలకు 180 సూచనలను జాబితాలో తీసుకుని 90 సూచనలకు సమాధానం ఇచ్చామన్నారు. గమనించదగిన 383 సూచనలపైకి 178 సూచనలకు సమాధానం స్వీకరించామన్నారు. జీరో అవర్‌లో 13 సూచనలపై చర్చించామని, ఒక హక్కుల ఉల్లంఘన సూచనను సమర్పించామన్నారు. తనిఖీ, పరిశీలన, నివేదికకోసం హక్కుల కమిటీకి అప్పగించామన్నారు. మానవ అవయవ మార్పిడికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ నియమాలు 2011 ప్రకారం రాష్ట్రంలో అమలు పరిచే విషయమై చర్చించామన్నారు.

బిహార్‌కు తరలిన డీసీఎం, ఎమ్మెల్యేలు



రాహుల్‌గాంధీతో డీసీఎం తదితరులు

బెంగళూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బిహార్‌లో చేపట్టిన ఓట్ అధికార్ ర్యాలీలో పాల్గొనేందుకు డీసీఎం డీకే శివకుమార్ తరలివెళ్లారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌మానె, బాబాసాహెబ్ పాటిల్, రాజుసేట్, రిజ్వాన్ అర్షద్, నయనా మోటమ్మ తదితరులు ప్రత్యేక విమానంలో శనివారం బయల్దేరారు. బిహార్‌లోని కటియార్ శిబిరంలో శనివారం రాహుల్‌గాంధీని రాష్ట్ర బృందం భేటీ అయ్యింది.

హాకథాన్ అనుభవాలు తెలుసుకోవాలి



పోటీల ప్రారంభోత్సవ వేదికపై ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణంగా జరిగే హాకథాన్ పోటీల అనుభవాలను విద్యార్థులు తెలుసుకోవాలని నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌ఎన్ సుబ్రమణ్య పిలుపునిచ్చారు. నేషనల్ కళాశాల జయనగర్‌లో జాతీయ స్థాయి హాకథాన్ ఇంపోర్ట్ హాక్ అకాడమీ ఏర్పాటు చేసింది. 24 గంటలపాటు జరిగిన హాకథాన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. నేషనల్ కళాశాల విద్యార్థిని తనుష, శ్రీవత్సలు సాంకేతికత అనుభవాలను పంచుకున్నారు. సురేశ్ నరసింహతోపాటు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మంత్లీ మనీ..!

● ఎక్సైజ్ శాఖలో ప్రతి పనికీ కమీషన్
● క్లబ్‌లు, బార్లనుంచి లక్షల్లో మామూళ్లు
● 50శాతం మంది అధికారులు, సిబ్బందిపై కేసులు

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానా నింపే కీలకశాఖలలో ఎక్సైజ్ శాఖ ప్రధానమైనది. ఇదోరకం మాఫియా వ్యాపారం లాంటిదే. అందుకే ఎక్సైజ్‌శాఖ విధించే నిబంధనలు వైన్‌షాప్ నుంచి బార్ అండ్ రెస్టారెంట్‌దాకా ప్రతిచోటా ఉల్లంఘన జరుగుతోంది. అదే అధికారుల జేబులు నింపుతోంది. ఎక్సైజ్‌శాఖలో లంచాలు సాధారణమనేది దశాబ్దాలకాలంగా అందరికీ తెలిసిందే. ఒకప్పుడు అధికారులు కూడా ఏదో మొక్కుబడిగా తీసుకునేవారు. పై అధికారులకు లేదా ఇతరత్రా కార్యక్రమాలు జరిగితే వాటి ఖర్చులకని వారి పరిధిలో వసూలు చేసేవారు. అయితే ఎక్సైజ్‌శాఖలో పోలీస్‌స్టేషన్ నుంచి కమిషనర్‌దాకా వసూళ్లే లక్ష్యంగా పెట్టుకున్నట్టు విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్‌శాఖకు ప్రతి పనికి నెలసరి చొప్పున వ్యాపారాన్ని బట్టి కొంత శాతం నిర్ధారించే పరిస్థితికి వచ్చింది. ఇందుకు బలాన్ని చేకూర్చేలా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ లంచానికి సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. ఇది ఆశాఖ అక్రమాలకు సాక్ష్యంగా మారింది. దీంతో లోకాయుక్తలో కేసు నమోదైంది.

ప్రతి పనికీ కమీషన్..

బార్, పబ్‌లతోపాటు మద్యం దుకాణాలనుంచి మంత్లీ మనీ పేరిట నెలసరి కోట్లాది రూపాయలు సేకరిస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కొత్త లైసెన్స్ మంజూరుతోపాటు ఎక్సైజ్‌శాఖలో ప్రతి పనికి కమీషన్ నిర్ధారించారు. అందుకు తగ్గట్టుగా సమకూరిస్తే ఒకటి రెండు రోజుల్లోనే పని పూర్తి అవుతుంది. లేనిపక్షంలో వ్యాపారాలు వదులుకుని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు వేయాల్సిన పరిస్థితి ఉంది. మద్యం దుకాణాలలో వ్యాపారాన్ని బట్టి నెలసరి మామూళ్లు నిర్ధారిస్తారు. ఇది కేవలం ఎక్సైజ్‌శాఖకు మాత్రమే పరిమితం కాలేదనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ, పోలీసు, వాణిజ్యపన్నులశాఖ విభాగాలలోనూ వ్యాపారాన్ని బట్టి నెలసరి మామూళ్లు ఉంటాయనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత డివిజన్లలో పనిచేసేందుకు వెళ్లే అధికారులు ముందస్తుగానే ముడుపులు చెల్లించుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు. ఎక్సైజ్‌శాఖ అంటే ఆ విషయంలో మరికొంత ముందడుగే అనిపిస్తుంది. జిల్లాలవారీగా వ్యాపారాలు కొనసాగే విధానాన్ని బట్టి మద్యం దుకాణాలకు మంత్లీ మనీ ఇవ్వాలనే ఆరోపణలు ఉన్నాయి.

నెలకు రూ.2 లక్షలు..

క్లబ్, పబ్‌లు నడిపేవారి నుంచి నెలసరి రూ.2 లక్షలు దాకా నిర్ధారించినట్టు తెలుస్తోంది. ఇక మద్యం దుకాణాలకు సంబంధించి వివాదాలు, ఇతరత్రా పరిణామాలు చోటు చేసుకుంటే వాటిని పరిష్కరించేందుకు మరికొంత డిమాండ్ తప్పదనే విమర్శలు ఉన్నాయి. మామూళ్లు ఇవ్వని వ్యాపారులపై అనవసరమైన వేధింపులు ఉంటాయి. నెలసరి వ్యాపారులు ఇచ్చే మామూళ్లు అన్ని స్థాయిల అధికారులు, సిబ్బందికి పంపిణీ అవుతున్నట్టు తెలుస్తోంది. ఎక్సైజ్‌శాఖకు సంబంధించి ఏటా పదిమంది అధికారులపై అవినీతి ఆరోపణలు వస్తుంటాయి. అధికారులు లంచాలు తీసుకుంటున్న సమయంలోనే లోకాయుక్త, ఏసీబీలకు పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. మామూళ్లు ఇవ్వకపోతే శాఖలో చిన్నపని కూడా జరగదనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్‌శాఖలో మామూళ్ల వసూళ్లు, అక్రమాలకు పాల్పడే అంశాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్టు విమర్శలు ఉన్నాయి. లైసెన్సుదారులనుంచి లంచం వసూళ్ల విధి నిర్వహణలో లోపం, ఆదాయానికి మించి ఆస్తులు సమకూర్చుకోవడం వంటి అంశాలపై ఎక్సైజ్‌శాఖలో సుమారు 50మంది అధికారులు, సిబ్బందిపై కేసులు ఉన్నాయి. 50శాతం కంటే ఎక్కువమంది అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులు వారికి వచ్చే వేతనానికి, వారి ఆస్తులకు ఎక్కడా పొంతన ఉండదనే ఆరోపణలు ఉన్నాయి.

ఎక్సైజ్ కమిషనర్ వీడియో వైరల్

మండ్య జిల్లా ఎక్సైజ్ కమిషనర్, ఓ పిటీషనర్‌తో మాట్లాడిన వీడియోలు వైరల్ అయ్యాయి. వాటి సంభాషణలు ఇలా ఉన్నాయి. బెంగళూరులో రూ.1.48 లక్షలు ఇంకా రావాల్సి ఉందని, మండ్య జిల్లాలో 15 దుకాణాలనుంచి 1.80 లక్షలు రావాల్సి ఉంది. రెండు కలిపితే 3.28 లక్షల రూపాయలు మాకు చేరాలి. బకాయిగా ఉండే మంత్లీ మనీని వెంటనే చెల్లించాలని అధికారి డిమాండ్ చేశారు. డబ్బులు వచ్చిన వెంటనే చెల్లిస్తానని అవతలి వ్యక్తి అధికారికి తెలిపాడు. సదరు వీడియోలు వైరల్ కావడంతో వాటిని వెంటనే డిలీట్ చేయాలని అధికారి విన్నవించారు. వీడియో వాపసు ఇస్తే అన్ని పనులు చేసి పెడతానని హామీ ఇచ్చారు. వీడియో ఇవ్వకపోతే నేను కాదంటే మరో ఏ అధికారి కూడా మీ పనులు జరగవని బెదరింపులకు పాల్పడినట్టు తెలుస్తోంది.



బెంగళూరు శాంతినగర్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం

పలువురి సస్పెన్షన్

2024 ఆగస్టు 20న విధి నిర్వహణలో లోపమని ఐదుగురు అధికారులను సస్పెండ్ చేశారు. సీఎల్ 4 లైసెన్స్ అనుమతుల విషయంలో జాప్యం చేసిన ఆరోపణలు ఉన్నాయి. 2024 సెప్టెంబరు 24న బెంగళూరులో 8 విభాగాలలో పనిచేసే 65మంది ఎక్సైజ్ అధికారులపై లోకాయుక్త దాడి చేసింది. 29న సీఎల్ 7 లైసెన్సు మంజూరుకు లంచం డిమాండ్ చేసిన మేరకు అప్పటి మండ్య జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రవిశంకర్, మద్దూరు డివిజన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ ఆరాధ్యలను సస్పెండ్ చేశారు. ఎక్సైజ్‌శాఖకు సంబంధించి ఆరోపణలు రావడంతో సుమోటోగా కేసు నమోదు చేసుకుని లోకాయుక్త న్యాయమూర్తి బీఎస్ పాటిల్ దర్యాప్తు చేశారు. లైసెన్స్‌ల రెన్యువల్ దరఖాస్తులను జాప్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని లోకాయుక్త సూచించింది. జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేయాలని లోకాయుక్త సూచించింది. ఎక్సైజ్ శాఖలో మామూళ్ల విషయం తెలిసిందే అయినా కొత్తకోణంగా లోకాయుక్త అధికారుల పేరిట బెదరించి వసూళ్లకు పాల్పడిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది.



స్నాతకోత్సవంలో పట్టాల ప్రదానం

దేశ నిర్మాణంలో యువశక్తి కీలకం

● శాస్త్రవేత్త గిరీశ్‌చంద్ర

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దేశభవిష్యత్తు నిర్మాణంలో యువత చేతిలో ఉందని, వారి శక్తి భవిష్యత్ ప్రగతికి కీలకమని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరీశ్‌చంద్ర అన్నారు. కనకపుర రోడ్డులోని సిటీ ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవంలో విద్యార్థులకు ఆయన పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాన ఆధారిత విద్య అవసరమన్నారు. ఇంజనీర్లు సైన్స్, మ్యాథ్స్‌తోపాటు అన్ని సబ్జెక్టుల గురించి సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. జ్ఞాన ఆధారిత ఇమాజినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేర్చుకోవడం అనేది నిరంతరంగా సాగే ప్రక్రియ కావాలన్నారు. విద్యార్థులు లర్న్, రీ లర్న్, అన్ లర్న్ అనే విధానంలో ముందుకెళ్లాలన్నారు. విద్యాసంస్థలనుంచి బయటకొచ్చే ఇంజనీర్లు పరిశ్రమకు అవసరమైనంత స్థాయిలో పరిణతి పొందడం లేదని విచారం వ్యక్తం చేశారు. నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు. యువత స్పూన్ ఫీడింగ్ వీడి పరిశ్రమలకు అవసరమైన రీతిలో వనరులుగా మారాలని సూచించారు. కొవిడ్ తర్వాత మార్పులు చోటు చేసుకున్నాయని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఏఐ ఆధారితతో అన్ని విషయాలు సమగ్రంగా తెలుసుకునేందుకు వీలుందన్నారు. 250మందికి పట్టాలు ప్రదానం చేశారు. ఏఎంసీ, సిటీ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ డాక్టర్ కేఆర్ పరమహంస మాట్లాడుతూ మా తల్లి పేరిట విద్యాసంస్థను ప్రారంభించామని, ఇక్కడ పేద, మధ్య తరగతి వర్గాలకు గుణాత్మక విద్య అందించేందుకు కట్టుబడ్డామన్నారు. మానవత్వపు విలువలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏఎంసీ, సిటీ, కేంబ్రిడ్జ్, బ్రూక్లిన్ సంస్థల వైస్‌ఛైర్మన్ కే గీతా పరమహంస, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ కరుణాకర, డాక్టర్ సౌమ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు: ఎస్పీ



8

ఉత్సాహంగా ట్యామ్స్-2025



విద్యార్థుల సందడి

బెంగళూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పీఈఎస్ విశ్వవిద్యాలయం జాతీయస్థాయిలో నిర్వహించి ట్యామ్స్ (ది అమెచ్యూర్ మేనేజర్ అండ్ సైంటిస్ట్) 2025 పోటీల మూడో ఎడిషన్ శనివారం ఉత్సాహంగా సాగాయి. దేశవ్యాప్తంగా 8 నుంచి 12వ తరగతి విద్యార్థులు శాస్త్రీయ మనోభావం, నిర్వహణా నైపుణ్యం పెంచేదిశగా పోటీలు జరిగాయి. యూనివర్సిటీ సీఓఓ ప్రొఫెసర్ అజోయ్‌కుమార్, కులపతి డాక్టర్ సూర్యప్రసాద్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం డీన్ డాక్టర్ శైలశ్రీ హరిదాస్ పోటీలకు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రముఖులు ప్రసంగిస్తూ యువత చిన్నవయసునుంచే నాయకత్వ లక్షణాలు పెంచుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. 9 రాష్ట్రాలకు చెందిన 376 పాఠశాలలనుంచి 5,900మంది విద్యార్థులు పాల్గొన్నారు. రోజంతా 17రకాల పోటీలు నిర్వహించారు. బెంగళూరు నందిని లే అవుట్ ప్రెసిడెన్సీ స్కూల్ సమగ్ర విజేత పురస్కారాన్ని దక్కించుకుంది. ఎస్‌జేపీయూసీ జట్టు రన్నరప్‌గా నిలిచింది.



ఏకదంతుడి రూపాలు ఎన్నెన్నో..

గణేశ్ చతుర్థికి సిద్ధమవుతున్న గణనాథులు

బెంగళూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మరో నాలుగురోజుల్లో వినాయక చవితి వేడుకలు జరగనున్నాయి. ఏకదంతుడిని ప్రతిష్ఠించేందుకు ఎన్నెన్నో రూపాలతో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు కళాకారులు. రాష్ట్రంలో ఈ ఏడాది పీఓపీ గణపతులకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టారు. పీఓపీ గణపతులు ప్రతిష్ఠించేందుకు అనుమతులు ఇచ్చేది లేదని అధికారులు తేల్చిచెప్పారు. దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల పరిధిలో గడిచిన రెండేళ్లుగా పూర్తిస్థాయిలో మట్టితో తయారు చేసిన గణపతులనే కొలిచారు. రాష్ట్రంలో వినాయక చవితిని ప్రాంతానికో ప్రత్యేకంగా జరుపుతారు. చిత్రదుర్గలో జరిగే ఉత్సవాలు జాతీయస్థాయిలోనే పేరొందాయి. తుమకూరులో నెలరోజులపాటు వినాయకుడిని ప్రతిష్ఠ చేసి పూజలు చేసే సంప్రదాయం ఉంది. బెళగావిలో జరిగే ఉత్సవాలు మహారాష్ట్ర సంప్రదాయాలతో కొనసాగుతాయి. బెంగళూరులో వినాయక ప్రతిష్ఠ మరింత ప్రత్యేకంగా ఉంటుంది. సాధారణంగా దేశమంతటా చవితిరోజున వినాయకుడిని ప్రతిష్ఠించి మూడు, ఐదు, ఏడు, తొమ్మిది, పదకొండు రోజులకు నిమజ్జనం చేస్తారు. కానీ బెంగళూరులో ప్రాంతాలవారీగా మూడు రోజులపాటు ప్రతిష్ఠించి పూజలు చేసే సంప్రదాయం నెలన్నరపాటు కొనసాగుతుంది. కాగా బసవనగుడిలో జరిగే బెంగళూరు గణేశ ఉత్సవ్‌లో నిర్వహించే సంగీత కార్యక్రమాలు జాతీయస్థాయిలోనే పేరొందాయి. దక్షిణాది, బాలీవుడ్ ప్రముఖ గాయకులు పాల్గొంటారు. వీరు 11రోజులపాటు ఉత్సవాలు జరుపుతారు. వినాయక విగ్రహాలను నగరంలోని ఆర్‌వీ రోడ్డుతోపాటు పలు చోట్ల విక్రయిస్తారు. ఆర్‌వీ రోడ్డులో గణేశ విగ్రహాల విక్రయాలు ఐదు దశాబ్దాలకుపైగా పేరొందాయి.



గణేశుడికి తుదిమెరుగులు దిద్దుతున్న కార్మికుడు





నగరంలోని ఆర్‌వీ నగర్ రోడ్డులో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథులు



విగ్రహాన్ని కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళ

మహిళ ఆత్మహత్య

బుక్కరాయసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలంపల్లి గ్రామంలో కడుపునొప్పి తాళలేక అమృత(23) శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గణేశ్‌కు నాలుగేళ్ల కిందట అమృతతో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల ఒక కుమారుడు ఉన్నాడు. గత కొంత కాలం నుంచి అమృత కడుపు నొప్పితో బాధపడుతుండేది. పలు చోట్ల చికిత్స చేయించినా కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో నొప్పి భరించలేక శనివారం ఇంట్లోనే ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. ఈ సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని మహిళ..

నార్పల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామంలో మతిస్థిమితం లేని సాకే రాజమ్మ(44)ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన కాటమయ్య భార్య సాకే రాజమ్మ రెండేళ్ల నుంచి మతిస్థిమితం లేకుండా ఉండేది. ఈక్రమంలోనే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబికులు పలుచోట్ల వెతికినా ఆమె జాడ తెలియలేదు. అయితే గ్రామ సమీపంలోని ఒక తోటలో ఉరి వేసుకుని సాకే రాజమ్మ మృతి చెందిందని స్థానికులు శనివారం కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారు వెళ్లి ఉరికి వేలాడుతున్న రాజమ్మ మృతదేహాన్ని కిందకు దించారు. మృతురాలికి కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గర్భిణి రాధిక మృతదేహానికి పోస్టుమార్టం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అబార్షన్ సమయంలో వైద్యం వికటించి మృతి చెందిన రాధిక మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఈ నెల మూడో తేదీ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మండలంలోని చెదల్ల గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భిణి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై బాధితులు ఎవరికీ ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. అయితే డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవీ అనంతపురం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లఘించి అబార్షన్ చేసి ప్రాణాలు తీశారని, ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేవని పలు అంశాలపై ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో అనంతపురం మూడో పట్టణ పోలీసుస్టేషన్ సీఐ క్రాంతిలాల్, బుక్కరాయసముద్రం సీఐ పుల్లన్న, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, వైద్యకళాశాల ప్రొఫెసర్ చెదల్లకు వెళ్లి సమాధిని తవ్వించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఏసీబీ కేసులో ఆర్టికల్ ఆఫ్ చార్జ్

అనంతపురం అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో ఉన్న వ్యవసాయ అధికారి వెంకటేశ్వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గిరిబాబుకు ప్రభుత్వం ఆర్టికల్ ఆఫ్ చార్జ్‌ను జారీ చేసింది. 2023 ఆగస్టులో రాప్తాడు రెగ్యులర్, కూడేరు ఇన్‌చార్జి ఏఓగా పనిచేసిన వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం ఏడీఏ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గిరిబాబును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఓ డీలర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసిన నేపథ్యంలో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుతం ఏసీబీ కోర్టులో ఈ కేసు నడుస్తోంది. ప్రస్తుతం ఏఓ వెంకటేశ్వరప్రసాద్ శ్రీసత్యసాయి జిల్లాలో, జూనియర్ అసిస్టెంట్ అనంతపురం జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిద్దరి వివరణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

28న వాకిన్ ఇంటర్వ్యూలు

అనంతపురం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగంలో ఖాళీగా ఉన్న అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు శనివారం తెలిపారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఎంబీఏ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఎంబీఏలో 55శాతం మార్కులు తప్పనిసరిగా వచ్చి ఉండాలని అన్నారు. ఆసక్తి గలవారు తమ సర్టిఫికెట్లతో పాటు రెండు పరిశోధన పత్రాలను తీసుకురావాలని సూచించారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ యువతకు హెవీ మోటారు వాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని ఎస్సీ కార్పొరేషన్ సంచాలకులు మహీధర్ శనివారం తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో శిక్షణకు పది మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు శిక్షణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి జిల్లా ఆర్టీసీ డిపో మేనేజరు ఆధ్వర్యంలో మోటారు డ్రైవింగ్ నేర్పిస్తారని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తామని ఎస్పీ జగదీష్ శనివారం తెలిపారు. సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు సోమవారం ఉదయం 8 గంటలకు అనంతపురంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు. సివిల్ విభాగంలో ఎంపికైన 278 మంది, ఏపీఎస్పీ విభాగంలో ఎంపికైన 210 మంది అభ్యర్థులకు వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులంతా అప్లికేషన్‌తో జత చేసిన అన్ని ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు కలర్ పాసుపోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

టీడీపీ పరిశీలకుల నియామకం

అనంతపురం క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లాకు ముగ్గురు పార్లమెంట్ కమిటీ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి పరిశీలకులుగా అమర్నాథ్ రెడ్డి, డోలా బాల వీరాంజినేయస్వామి, మద్దిపట్ల సూర్యప్రకాష్‌ను నియమించారు. పార్లమెంట్ కమిటీల ఏర్పాటు ప్రతిపాదనల సేకరణ కోసం ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ నెల 26న ఇతర పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ సమావేశాలతోపాటు, అనంతపురంకమిటీ సమావేశం నిర్వహిస్తారు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 890 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చవితి ఉత్సవాలకు పటిష్ట భద్రత

● పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి ● నేర సమీక్షలో ఎస్పీ రత్న



కేసుల ఛేదనలో అత్యుత్తమ ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందికి పురస్కారాలు అందజేస్తున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని ఎస్పీ రత్న ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నేర సమీక్ష నిర్వహించారు. నేర పరిశోధనలో, న్యాయ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ పరికరాలు, డిజిటల్ రికార్డులు, ఆన్‌లైన్ డేటా పక్కాగా ఉండాలని, నేరస్థులకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందేలా ఉత్సవ కమిటీలకు సూచనలు ఇవ్వాలని అన్నారు. పాత నేరస్థులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. పెద్ద విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని అన్నారు. మిస్సింగ్, పోక్సో మహిళలపై జరిగే నేరాల కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ కేసులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, శివన్నారాయణస్వామి, నరసింగప్ప, మహేష్, హేమంత్‌కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఐటీ కోర్ ఇన్‌చార్జి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణం.. పరిసమాప్తం

అంజన్నకు విశేష పూజలు



నెట్టికంటి, మురడి, నేమకల్లు ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

గుంతకల్లు, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శ్రావణ మాసోత్సవాలు శనివారంతో ముగిశాయి. కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో అమావస్య, మాస ఐదో శనివారం సందర్భంగా పూజా కార్యక్రమాలను విశేషంగా నిర్వహించారు. రాత్రి ఒంటె వాహనంపై సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామివారు ఊరేగించారు. ఈఓ విజయ రాజు, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటువెంకటేశ్వర్లు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మురడి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన నిర్వహించారు. ఆఖరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెద్దమడి ఆనందరెడ్డి, దేవరెడ్డిపల్లి హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నేమకల్లు ఆంజనేయస్వామికి విశేష పూజలు జరిగాయి. స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ బందోబస్తును పర్యవేక్షించారు. ఎస్ఐ నబీరసూల్, ట్రైనీ ఎస్ఐ వినోద్, ఎఎస్ఐ హనుమంతరెడ్డి బందోబస్తులో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, మాజీ ధర్మకర్తలు కాశీనాథ్‌శెట్టి, శాంతయ్య, టీడీపీ నాయకుడు గాలి బసప్ప పాల్గొన్నారు.

అనుచితంగా ప్రవర్తించి.. హతమయ్యాడు

ధనుంజయ హత్య కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తన భార్యతో అనుచితంగా ప్రవర్తిస్తున్నందుకే మెకానిక్ ధనుంజయను వరుసకు సోదరుడైన శివయ్య హత్య చేశాడని పోలీసులు గుర్తించారు. పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లో ఈ నెల 21వ తేదీ రాత్రి జరిగిన మెకానిక్ పాళ్యం ధనుంజయ హత్య జరిగింది. ఈ కేసులో నిందితుడు శివయ్యను అరెస్టు చేశామని డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శనివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు తెలిపారు. కేతిరెడ్డి కాలనీ ఎల్-2లో పాళ్యం శివయ్య, ఎల్-3లో అతని పిన్ని కుమారుడు పాళ్యం ధనుంజయ నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ స్నేహంగా ఉంటూ మద్యం సేవించేవారు. శివయ్య భార్యతో ధనుంజయ చెడుగా ప్రవర్తించేవాడు. దీంతో శివయ్య మందలించాడు. అయినా అతనిలో మార్పురాలేదు. దీంతో శివయ్య కక్ష పెంచుకుని పథకం ప్రకారం ఈ నెల 21వతేదీ అర్ధరాత్రి ఎల్‌పీ సర్కిల్‌లో బ్రిడ్జి కింద ధనుంజయను సిమెంట్ ఇటుకతో బాది చంపేశాడు. నిందితుడిని సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ కేతన్న, హెడ్ కానిస్టేబుళ్లు అప్పస్వామి, శివశంకర్, కానిస్టేబుళ్లు రాజప్ప, షాకీర్, బయన్న, సుధీర్‌కుమార్, రాజన్న శనివారం అరెస్టు చేశారని డీఎస్పీ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణ, పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్టు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆయన అరెస్టుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన పాల్తూరి రామకృష్ణ అలియాస్ బాలరామకృష్ణన్ ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రం వేలూరులో నివాసముంటున్నాడు. మరో నింది తుడు భగవంతప్ప రామాంజినప్ప కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా పన్నసముద్రం పంచాయతీ అచ్చంపల్లి గ్రామంలో ఉంటున్నారు. వీరిద్దరు ధర్మవరం పట్టణ, పరిసర ప్రాంతాలలో పగటిపూట రెక్కీ నిర్వహిస్తూ రాత్రిపూట ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. అలాగే చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఆయా ఘటనలపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9లక్షల బంగారం అభరణాలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు , టూటౌన్ పరిధిలో ఒకటి, పావగడ పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు ఉన్నాయన్నారు. వీరిద్దరూ ఇదివరకే చోరీ కేసుల్లో కోయంబత్తూరు, అనంతపురం జిల్లాలోని జైళ్లలో శిక్ష అనుభవించారన్నారు. రామాంజి నప్ప కర్ణాటక రాష్ట్రంలో కూడా పలు ఇళ్లలో చోరీలు చేసి అభరణాలను బెంగళూరులో విక్రయించాడని వివరించారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, హెడ్‌కానిస్టేబుల్ అప్పస్వామి, కానిస్టేబుళ్లు రాజప్ప, షాకీర్‌లు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో రైతు బజార్

మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీలు రాఘవేంద్రకుమార్, నరసింహామూర్తిలతో కలిసి శనివారం ఆయన మార్కెట్ కమిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీ కార్యదర్శులతో మార్కెట్ ఫీజు వసూళ్లపై చర్చించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ..రైతు బజారుకు నిర్మాణం కోసం అర ఎకరా నుంచి ఒక ఎకర స్థలం కావాల్సి ఉందన్నారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూముల సేకరణకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. స్థలాలు లభ్యమైతే రూ.50 లక్షల నుంచి రూ. కోటివరకు నిధులతో రైతు బజారు ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్ యార్డులలో ఉద్యాన, వ్యవసాయేతర షెడ్లు, కోల్డ్ స్టోరేజీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రీజియన్‌లో 74 మార్కెట్ కమిటీలుండగా 50కమిటీల్లో పాలకవర్గం ఏర్పాటైనట్లు తెలిపారు.

ఆశాజనకంగా వసూళ్లు

ఈ ఆర్థిక సంవత్సరం మార్కెట్ కమిటీల ఫీజు వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. రీజియన్‌లోని ఎనిమిది జిల్లాలో 145.35కోట్ల ఫీజు వసూళ్లు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నాలుగు నెలల్లో రూ.39.54కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. నాలుగు నెలల్లో అనంతపురం రూ.13.49కోట్లకు గాను రూ.3.95కోట్లు, చిత్తూరు రూ 10.39కోట్లకు..3.85కోట్లు, కడప రూ.13.53కోట్లకు 3.61కోట్లు, కర్నూలు రూ.40.40కోట్లకు రూ.7.35కోట్లు, నంద్యాల రూ.26.66కోట్లకు..రూ.8.18కోట్లు, తిరుపతి రూ.25.91కోట్లకు..రూ.7.24కోట్లు, అన్నమయ్య రూ.9.15కోట్లకు..3.91కోట్లు, శ్రీ సత్యసాయి రూ.5.82కోట్లకు రూ.1.42కోట్ల మార్కెట్ ఫీజు వసూలైనట్లు తెలిపారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయండి

జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేష్ చతుర్థి ఉత్సవాలను సంబంధిత శాఖాధికారులు, ఉత్సవకమిటీ సభ్యులు సమన్వయంతో విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో గణేశ ఉత్సవ సమితి, సంబంధిత అధికారులతో శనివారం ఆయన గణేశ చతుర్థి ఉత్సవ నిర్వహణ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 31 వరకు జరిగే ఉత్సవాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించాలన్నారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసు, ఫైర్, మున్సిపల్, పంచాయతీ విభాగాలతో అనుమతి తీసుకోవాలన్నారు. పర్యావరణరహిత మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు. రాత్రి 10గంటల తరువాత లౌడ్‌స్పీకర్లు పెట్టరాదన్నారు. గుత్తి రోడ్డులోని హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తే.. విగ్రహాల నిమజ్జనానికి అనుకూలంగా ఉంటుందని నిర్వాహకులు జేసీకి విన్నవించారు. ఈ అంశంపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్ఈని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ అష్రఫ్‌అలీ, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, ఎక్సైజ్ అధికారి రామ్‌మోహన్‌రెడ్డి, పీసీబీ ఈఈ పీవీ కిషోర్, డీఈఓ ప్రసాద్ బాబు, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం: కలెక్టర్

పుట్లూరు, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): వర్షాకాల నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కడవకల్లు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. గ్రామాల్లో ఎక్కువగా ఇంకుడు గుంతలు తవ్వుకుంటే వర్షపునీరు భూగర్భజలంగా వృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. కడవకల్లు ఎస్సీకాలనీలో నీరు నిల్వ ఉండకుండా వెళ్లేలా మ్యాజిక్ డ్రైన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతకుముందు గ్రామంలో పర్యటించి లబ్దిదారులు లక్ష్మీదేవి, భూలక్ష్మి ఇళ్ల వద్ద ఉపాధిహామి పథకం కింద చేపట్టిన వ్యక్తిగత సోక్‌పిట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పలురకాల మొక్కలను నాటారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాల మైదానం కోసం అవసరమైన స్థలాన్ని గ్రామంలో గుర్తించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేషారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామసుబ్బయ్య, డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ పుల్లారెడ్డి, ఏపీఓ తులసీప్రసాద్, ఈఓఆర్‌డీ శివప్రసాద్, సర్పంచు రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి ఫెన్సింగ్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-17 ఫెన్సింగ్ క్రీడాకారుల సెలెక్షన్‌లు ఈ నెల 25వతేదీన అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ కృష్ణ, కార్యదర్శి పుష్పావతి తెలిపారు. అండర్-17 బాల, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. 2009 జనవరి 1 నుంచి 2012 డిసెంబరు 31వ తేదీ లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9553768295లో సంప్రదించాలని కోరారు.

రేపు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణుల ఎంపిక పోటీలు ఈనెల 25వ తేదీన ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30వ తేదీన గుంటూరు జిల్లా సత్తెనపల్లి లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు తమ జననధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 7989017210లో సంప్రదించాలని కోరారు.

28న రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు

పారా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ జూనియర్, యూత్ పోటీలు ఈ నెల 28న అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి, అర్హతగల పారా క్రీడాకారులు ఈ నెల 26వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలు జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9390388169, 8074106154లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహనకు క్విజ్

అనంతపురం వైద్యం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులు, కౌమార ఆరోగ్యం, మాదక ద్రవ్యాలతో అనర్థాలపై విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన పోటీలకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీడీ నియంత్రణ విభాగాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, డీవీఈఓ వెంకటరమణ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ అనుప జేమ్స్ తెలిపారు. క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతిని ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు హేమంత్, చరణ్ తేజ, ద్వితీయ బహుమతిని తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గౌసియా, సిద్ధిబాషావలి, తృతీయ బహుమతిని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మౌనిక, ధరణి గెలుపొందారు. ఈ నెల 26న విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రథమ, ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులు వెళతారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురుప్రసాద్, నోడల్ ఆఫీసర్ ఉషాకుమారి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు రమణ, మురళీ, రిడ్స్ మేనేజర్ నరేష్‌బాబు, శివారెడ్డి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.20, సరాసరిధర రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,105 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీపురు పట్టిన న్యాయాధికారులు



కోర్టులో గదిని శుభ్రం చేస్తున్న ఏడీజే

హిందూపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయాధికారి కంపెల్లె శైలజ, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్ శనివారం పాల్గొన్నారు. చీపురు చేతబట్టి న్యాయస్థానంలో శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ తమ కార్యాలయాలు, ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. దీనివల్ల దేశానికి సేవ చేసినవారమవుతామని అన్నారు. పరిశుభ్రత సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

అర్హులైన ప్రతి దివ్యాంగుడికి పింఛన్

- చైర్మన్ గడిపూటి నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

అనంతపురం క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి దివ్యాంగుడికి పింఛన్ అందుతుందని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన భిన్న ప్రతిభావంతుల జాతీయహక్కుల ఐక్యవేదిక, ఇతర నాయకులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో అనర్హులు చాలా మంది పింఛన్ల పేరుతో ప్రభుత్వ నిధులు స్వాహా చేశారన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ చేస్తోందన్నారు. ఏ ఒక్క దివ్యాంగుడికి పింఛన్ రద్దు కాదని ఆయన స్పష్టం చేవారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జాతీయహక్కుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వసంత కుమార్, జిల్లా కార్యదర్శి రామయ్య, కమిటీ నాయకులు రాజేష్, సింహ మోహన్, ఇతర నాయకులు మాబు, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో గర్భిణి మృతి



హారిక (ఫైల్)

యాడికి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరన్నపల్లి గ్రామానికి చెందిన మూడునెలల గర్భిణి హారిక(22) అనారోగ్యం కారణంగా శనివారం మృతిచెందారు. హారిక, కేశవ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏడాది వయసున్న కూతురు కావ్య ఉంది. హారిక శుక్రవారం పాడి పశువులు కాయడానికి వెళ్లి వచ్చారు. రాత్రి కడుపు నొప్పితో బాధపడ్డారు. వాంతులు, విరేచనాలు అయ్యాయి, ఫిట్స్ కూడా వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను యాడికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం తాడిపత్రికి, మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హారిక మృతిచెందారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఆరోగ్యసిబ్బంది వీరన్నపల్లి గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనారోగ్యంతోనే హారిక మృతిచెందినట్లు తెలిపారు.

కంటైనర్లను అడ్డుకున్న నాయకులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కియ అనుబంధ పరిశ్రమ 'సంగు హైటెక్ కంపెనీ'లో పనులు తమకే కవాలని కొందరు నాయకులు కంటైనర్లను శనివారం అడ్డుకున్నారు. ఆ కంపెనీలో వైసీపీ నాయకులు కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు. ఆ పనులను రద్దుచేసి తమకు ఇవ్వాలని కోరుతూ శనివారం సాయంత్రం సంగు కంపెనీ నుంచి వస్తున్న కంటైనర్లను ఆపి, డ్రైవర్లను బెదిరించారు. విషయం తెలుసుకున్న కియ పోలీసులు అక్కడికి చేరుకునేలోగా వారు పరారయ్యారు. నాలుగు ద్విచక్రవాహనాల్లో ఐదుగురు వచ్చి బెదిరించారని డ్రైవర్లు తెలిపారు. ఈ విషయంపై కియ ఎస్ఐ రాజేష్‌ను వివరణ కోరగా, టీడీపీ నాయకులే పనుల కోసం ఇలా చేస్తున్నారని తెలిపారు.

ఆదర్శం.. ఆంధ్రకేసరి జీవితం : కలెక్టర్



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతు లు నిరాండంబర జీవన విధానం అందరికీ ఆదర్శప్రా యమని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళుల ర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, సంఘ సంస్కర్తగా , స్వాతంత్ర్య సమరయోధుడిగా బ్రిటిషువారితో పోరాడారన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదివి ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. ఆయన ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా తన నిరాండంబర జీవన విధానంతో ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కలెక్టరేట్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


ఎస్పీ నివాళి..

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శప్రాయమని ఎస్పీ రత్న కొనియాడారు. టంగుటూరి జయంతిని పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా, రచయుతగా రాణించిన విశేష ప్రతిభాశాలి టంగుటూరి అని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ ఏఓ సుజాత, డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు వలి, మహేష్, రవికుమార్, సూపరింటెండెంట్ సరస్వతి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఆర్‌జీ భండార్కర్ (వర్ధంతి)




'సర్' రామకృష్ణ గోపాల్ (ఆర్‌జీ) భండార్కర్ 1837 జూలై 6న మహారాష్ట్ర రాష్ట్రం సింధుదుర్గ జిల్లా మాల్వాన్‌లో జన్మించారు. విద్యావేత్త, సంఘ సంస్కర్త. ఆంగ్ల సాహిత్యంలోనూ, చరిత్ర, సంస్కృతంలో పరిశోధనలు చేశారు. బాంబే యూనివర్శిటీ తొలి డిగ్రీ బ్యాచ్ 1862లో ఒకరు. మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీని జర్మనీలోని గొట్టిన్‌జెన్ యూనివర్శిటీ నుంచి అందుకున్నారు. ఆరు దశాబ్దాలపాటు మహారాష్ట్రలో సమాజంలో సంస్కరణలకు కృషి చేశారు. 'కౌన్సిల్ ఆఫ్ ఇండియా'కు 1903లో అనధికారిక సభ్యుడిగా ఎన్నికయ్యారు. అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నుంచి 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్' పురస్కారం అందుకున్నారు. 1925 ఆగస్టు 24న కన్నుమూశారు.

అరుణ్ జైట్లీ (వర్ధంతి)



అరుణ్‌జైట్లీ 1952 డిసెంబరు 28న ఢిల్లీలో జన్మించారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా వ్యవహరించిన ఆయన రాజకీయాల్లోనూ రాణించారు. ప్రధాని వీపీ సింగ్ హయాంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. బీజేపీ ద్వారా రాజ్యసభలో 2009 నుంచి 2014 వరకు ప్రతిపక్ష నేతగా, అనంతరం కేంద్ర విదేశీ వ్యవహారాలు, డిఫెన్స్, ఆర్థికశాఖ మంత్రిగా కీలకహోదాలలో కొనసాగారు. ప్రధాని నరేంద్రమోదీ కేబినెట్‌లో జీఎస్టీ, డిమానిటైజేషన్, రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో విలీనం చేయడం వంటి ప్రముఖ నిర్ణయాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2019 ఆగస్టు 24న కన్నుమూశారు. మరణానంతరం 'పద్మవిభూషణ్' పురస్కారం ప్రకటించారు.

పండిట్ బసవరాజ్ రాజ్‌గురు (జయంతి)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత పండిట్ బసవరాజ్ రాజ్‌గురు 1920 ఆగస్టు 24న కర్ణాటక రాష్ట్రం ధారవాడ జిల్లా ఎలివాళ గ్రామంలో జన్మించారు. సంగీతంలోని కిరానా ఘరానా శైలి ఆలాపనలో పేరొందారు. విజయనగర సామ్రాజ్య 600వ వార్షికోత్సవంలో హంపిలో గురువు పంచాక్షర గవాయ్‌తో కలసి తొలి కచేరీ ప్రదర్శించారు. శాస్త్రీయ సంగీతం, ఖ్యాల్, వచన, నాట్యగీత్, తుమ్రి, గజల్‌లలోనూ ప్రతిభ చాటుకున్నారు. సంగీత నాటక అకాడమీ, పద్మశ్రీ, పద్మ భూషణ్ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్ తదితర అవార్డులు పొందారు. 1991 జూలై 20న కన్నుమూశారు.

అంజలీదేవి (జయంతి)



అభినవ సీతమ్మగా పేరొందిన అంజలీదేవి 1927 ఆగస్టు 24న తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో జన్మించారు. తెలుగు సినీ నటి, నిర్మాత. అసలు పేరు అంజనీ కుమారి. నర్తకి అయిన ఆమె రంగస్థలంలో జీవితాన్ని ప్రారంభించారు. సినీప్రస్థానంలో దర్శకుడు పుల్లయ్య ఆమె పేరును 'అంజలీదేవి'గా మార్పు చేశారు. 'లవకుశ'లో ఎన్టీ రామారావు సరసన సీత పాత్రలో నటించి ఆ పాత్రకే వన్నె తెచ్చారు. సుమారు 500 తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో నటించారు. 27 సినిమాలు నిర్మించింది. ఆమె భర్త పి నారాయణరావు సంగీత దర్శకుడు. ఉత్తమ నటిగా ఫిలింఫేర్ అవార్డులు, రఘుపతి వెంకయ్య పురస్కారం, ఏఎన్‌ఆర్ జాతీయ పురస్కారం తదితర గౌరవాలు అందుకున్నారు. 2014 జనవరి 13న కన్నుమూశారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న రవీంద్ర జల్దార్

రాయచూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జహిరాబాద్ కాలనీలో వీరాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 30 ఏళ్లుగా ఆలయం వద్ద ఉద్దేశిత ధ్వజస్తంభ పనులు ఎప్పటికప్పుడు వాయిదా పడుతూవచ్చాయి. మూడు దశాబ్దాల అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన జరగడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. 25 అడుగుల ఎత్తుగల ధ్వజస్తంభాన్ని నగరసభ సభ్యురాలు ఉమా రవీంద్ర జల్దార్, రవీంద్ర జల్దార్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శనైశ్చర స్వామికి పూజలు



పావగడ, (ఆంధ్రజ్యోతి): పావగడలోని శనైశ్చర ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 4 గంటల నుంచి స్వామివారికి తైలాభిషేకం, నవగ్రహపూజ, సీతలాంబకు కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రావణమాసంలో స్వామివారి, శీతలాంబను దర్శించుకుంటే పంచమిశని, సప్తమిశని, అష్టమిశని, ఏలినాటిశని దోషాలు వైతొలుగుతాయని ప్రధాన అర్చకులు కృష్ణాశాస్త్రి తెలిపారు. దాదాపు 30వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, కమిటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు.

ఘనంగా వెండి పల్లకి ఉత్సవం

జేష్ఠాదేవి సమేత శనైశ్చరుడిని పట్టణంలో శనిమహాత్మ సర్కిల్‌లో వెండి పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. వేలాది మంది భక్తుల నడుమ శనివారం రాత్రి 7-30కు గోవింద నామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవం సాగింది. అమరాపురం: అమరాపురంలోని బసవనపల్లి శనైశ్చరాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి భక్తులు వెండికిరీటాన్ని వితరణ చేశారు.



జేపీనగర్‌లోని తిరుమలగిరి వేంకటేశ్వరస్వామికి అలంకరణ



పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు



విజయనగర్‌లోని మారుతిమందిరంలో భక్తుల సందడి



మాగడిరోడ్డు టోల్‌గేట్‌లోని శనైశ్చర ఆలయంలో

ఆలయాల్లో శ్రావణ శనివార వైభవం

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం పురస్కరించుకుని నగరవ్యాప్తంగా పలు ఆలయాలలో విశేషపూజలు కొనసాగాయి. ప్రత్యేకించి వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శనైశ్చరస్వామి ఆలయాలలో ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. భక్తులు గోవిందనామస్మరణ చేసి దర్శించుకున్నారు. జేపీనగర్ రెండోస్టేజ్‌లోని తిరుమలగిరి శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో భక్తులు పోటెత్తారు. విజయనగర్‌లో పేరొందిన మారుతిమందిరంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేయగా భక్తులు తరలివచ్చారు. కాగా పలు శనైశ్చరస్వామి ఆలయాలలోనూ తైలాభిషేకం, తులసి అలంకరణ చేశారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: తాలూకాలోని పాతపాళ్య హోబళి గుడిపల్లి గ్రామంలో దేవాదాయశాఖకు చెందిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శనివార విశేషపూజలు కొనసాగాయి. ఉదయం స్వామివారికి విష్ణుసహస్రనామ పారాయణ, పంచామృత అభిషేకం, ఇతర ధార్మిక కార్యక్రమాలు, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. బీఎస్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం రామచంద్ర (హరాడి చిన్ని), మల్లిగె ఫౌండేషన్ సంస్థాపకులు ఆంజనప్ప యాదవ్ మాట్లాడుతూ పురాణ ప్రసిద్ధమైన ఆలయాన్ని 2014 నుంచి క్రమేపీ అభివృద్ధి జరుగుతోందన్నారు. పూర్వీకుల సంప్రదాయం ప్రకారం శ్రావణమాసంలో విశేషపూజలు, అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పర్వదినాలలో తాలూకా నుంచే కాకుండా సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల భక్తులు కూడా వస్తుంటారన్నారు. ఈ సందర్భంగా వీధివ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునిరాజు, బీఎస్‌ఎస్ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యశోద, ఉపాధ్యాయులు నాగరాజ్, రమణ, వెంకటేశప్ప, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో విశేషపూజలు

ముళబాగిలు: శ్రావణమాసంలో చివరి శనివారాన్ని పురస్కరించుకుని పురాణ ప్రసిద్ధ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సుప్రభాత సేవ, మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లకు, గోవిందరాజస్వామి, వరదరాజస్వామి, వేణుగోపాలస్వామి, చన్నకేశవస్వామి, నరసింహస్వామిలకు ప్రత్యేక అలంకరణలు చేశారు. కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాలతో పాటు బెంగళూరు నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శ్రావణమాసంలో చివరిశనివారం బెంగళూరు మయూరి హోటల్ యజమాని చెన్నారెడ్డి, ఆడిటర్ జగన్నాథరెడ్డిలు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జగన్నాథరెడ్డి మాట్లాడుతూ ముళబాగిలు ఆంజనేయస్వామిని దశాబ్దాలకాలంగా కొలుస్తున్నామన్నారు. 25ఏళ్లుగా శ్రావణ మాసంలో చివరి శనివారం అన్నదానం కొనసాగిస్తున్నామన్నారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి కేవీ సుబ్రమణ్యం కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణామాచార్ నేతృత్వంలో వైఖానస ఆగమ రీత్యా పూజాకైంకర్యాలు సాగాయి. ఆలయ వ్యవస్థాపక సమితి అధ్యక్షుడు ఆర్‌ఎస్ సుహాస్‌శెట్టి, సభ్యులు ఎంకే సుబ్రమణి, ఎస్ శ్రీనివాస్, వీ వరలక్ష్మి, ఎం సుమ, నవీన్, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.



బాగేపల్లి జడమడుగులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి



అన్నదానం చేస్తున్న చెన్నారెడ్డి, జగన్నాథరెడ్డి



రాజాజినగర్‌లోని కైలాస వైకుంఠ దేవస్థానంలో...



వేంకటేశ్వరస్వామికి అలంకరణ

బుద్ధుడి విగ్రహ ధ్వంసంపై నిరసన

శ్రీనివాసపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా మదనపల్లి బుద్ధుడికొండలో జూలై 2న బుద్ధుడి విగ్రహం తల తొలగించిన ఘటన చోటు చేసుకుంది. అప్పటినుంచి బుద్ధుడి కొండపైకి బౌద్ధులను అనుమతించకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. బుద్ధుడి విగ్రహం ధ్వంసానికి కారకులైనవారిని గుర్తించేందుకు సిట్ ఏర్పాటు చేయాలని కోరుతూ నిరసన తెలిపిన వీసీకే, బాస్ సంస్థల ప్రముఖులపై కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో బుద్ధుడి కొండ సందర్శన బౌద్ధ సమ్మేళనం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ భారతీయ అంబేద్కర్‌సేన నేతలు డీఎస్పీ, జిల్లా కలెక్టర్‌కు వినతులు సమర్పించారు. అనుమతులు ఇస్తామని చెప్పి చివరకు బుద్ధుడి కొండ చుట్టూ 5 కిలో మీటర్ల వరకు ఆంక్షలు ఉంటాయని, సభలు, సమావేశాల నిర్వహిస్తే తీవ్రమైన కేసులు తప్పవని అధికారులు ప్రకటించారు. ఈ పరిణామాలను ఖండిస్తూ శనివారం దళిత సంఘర్ష సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రజాస్వామ్య హననంపై భారీ నిరసన చేపడతామని హెచ్చరించారు.



వేదికపై ప్రముఖులు

సామూహిక శివపంచాక్షరి పఠనం



ప్రసంగిస్తున్న చంద్రకాంత్‌కుమార్

విజయపుర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన ధర్మస్థళపై సాగుతున్న దుష్ప్రచారం, కుట్రలను దూరం కావాలని కోరుతూ సంగమేశ్వర ధర్మసంస్థ అధ్యక్షుడు ఎం చంద్రకాంత్ కుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని చన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ పుణ్యక్షేత్ర సంరక్షణా సమితి ఆధ్వర్యంలో సామూహిక శివపంచాక్షరి మంత్రపఠనం సాగింది. ఈ సందర్భంగా చంద్రకాంత్‌కుమార్ మాట్లాడుతూ ధర్మస్థళ మంజునాథ పుణ్యక్షేత్రం గత కొన్ని దశాబ్దాలుగా ధార్మిక కార్యక్రమాలతోపాటు నిర్వహిస్తోందని, వందలాది ధార్మిక క్షేత్రాల జీర్ణోద్ధరణ వంటివి చేస్తున్నారన్నారు. క్షేత్రంలో నిరంతరం అన్నదానం పుణ్యకార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఏటా దేశవిదేశాలనుంచి కోట్లాదిమంది భక్తులు సందర్శిస్తున్నారన్నారు. వందలాది సంవత్సరాల పరంపరతో ప్రజల విశ్వాసానికి ప్రతీకగా ఉన్న పవిత్రపుణ్యక్షేత్రం పట్ల కొంతమంది ధర్మవ్యతిరేకులు కుట్ర పన్నారని విచారం వ్యక్తం చేశారు. ధర్మస్థళ పవిత్రతకు భంగం కలగకుండా భక్తులు అండగా నిలవాలన్నారు. బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ధర్మస్థళ పవిత్రతను కాపాడేందుకు భక్తులలో చైతన్యం పెంచేలా వారంరోజులపాటు మఠాలు, మందిరాలు, ఆలయాలు, ఇళ్లల్లోనూ వ్యక్తిగత, సామూహిక శివపంచాక్షరి పఠనం చేస్తున్నామన్నారు. పుణ్యక్షేత్ర సంరక్షణా సమితి సంచాలకులు రఘు, మహంతిమఠం ధర్మసంస్థ కోశాధికారి మధు, రవి, మణి తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తులు

భక్తులకు సౌకర్యాలు కల్పించండి



ఎమ్మెల్యే కృష్ణప్ప తదితరులు

దొమ్మసంద్ర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా బన్నేరుఘట్ట అటవీప్రదేశంలో వేల సంవత్సరాల చరిత్ర కల్గిన చంపకధామస్వామి ఆలయాన్ని, సువర్ణముఖి పుష్కరిణిని బెంగళూరు దక్షిణ ఎమ్మెల్యే ఎం కృష్ణప్ప సందర్శించి శ్రావణ శనివార పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్థానికుల సమస్యలను ఆలకించి అటవీ, పోలీసుశాఖ ద్వారా అందాల్సిన సౌలభ్యాలు కల్పించాలని సూచించారు. ఆలయం అడవిలో ఉండడంతో పర్వదినాలు, పండుగల రోజులలో భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది. పుష్కరిణి వద్ద రీల్స్ చేసుకుంటూ ఉంటారని అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతను కల్పించాలని, ఆలయంలో భక్తులకు తగిన సౌలభ్యాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బన్నేరుఘట్ట వీఎస్‌ఎస్‌ఎన్ ఉపాధ్యక్షుడు డీఎం రఘు, ప్రముఖులు హనుమంతరాజు, జయరాము, చిక్కణ్ణ, నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సభ్యుడిగా నారాయణప్ప

దొమ్మసంద్ర, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నాలుగన్నరేళ్ల అనంతరం కోర్టు తీర్పుతో గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా నారాయణప్ప (మొదలియార్) గెలుపొందారు. ఆదేశాల ప్రతిని స్పెషల్ తహసీల్దార్ కరినాయక్, పీడీఓ మంజునాథరెడ్డిలు శనివారం అందచేశారు. ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామ పంచాయతీలో 12వ వార్డు సభ్యుడు కృష్ణారెడ్డి 2020లో జరిగిన ఎన్నికల వేళ నామినేషన్‌వేళ తప్పుడు సమాచారం సమర్పించి గెలుపొందారు. కృష్ణారెడ్డిపై పోటీ చేసి నారాయణప్ప ఓడిపోయాడు. అయితే కృష్ణారెడ్డిపై భూకబ్జా ఆరోపణలకు సంబంధించి ఎన్నికల అధికారులకు, కోర్టుకు ఫిర్యాదు చేశారు. నాలుగన్నరేళ్ల అనంతరం కృష్ణారెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేస్తూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. నారాయణప్ప మాట్లాడుతూ గ్రామపంచాయతీ సభ్యులతో కలసి గ్రామాభివృద్ధికి ప్రామాణికంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రముఖులు జయదేవ్, ఆరతిగౌడ, పునీతమ్మ, జయరామ్, గోవిందరాజ్, డీఎస్ ఎస్ మునిరాజు, అనకరహళ్ళి కృష్ణప్ప, నాగరాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.



ఆదేశాల ప్రతిని అందుకుంటున్న నారాయణప్ప

సత్ప్రవర్తనతో మెలగండి

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్

హిందూపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఖైదీలు బయటకు వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్ సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ జైలు నుంచి బయటికి వెళ్లాక ఎలాంటి ఘర్షణలు, కక్షల జోలికి వెళ్లకుండా జీవనం సాగించాలన్నారు. ఎప్పటి నుంచి ఏయే కేసుల్లో జైలులో ఉన్నారని ఆరాతీశారు. ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్థోమతలేకపోతే న్యాయస్థానం దృష్టికి తీసుకొస్తే అలాంటివారికి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జైలు అధికారి హనుమన్న, న్యాయవాదులు పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

నడకకు అనుగుణమైన పాదరక్షలు వాడాలి

బెంగళూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నడకకు అనుగుణమైన పాదరక్షలు వాడాలని మల్టిపుల్ స్క్లిరోసిస్ (ఎంఎస్) సొసైటీ సీఈఓ రజ్జీ మెహదాన్ అభిప్రాయపడ్డారు. నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మా ట్లాడుతూ మల్టిపుల్ స్క్లిరోసిస్ అనే ది మెదడు, వెన్నెముక, కళ్ల నరాలను దెబ్బతీసే ఓ దీర్ఘకాల వ్యాధి. ప్రారంభ లక్షణాలు బలహీనత, జలదరింపు, తిమ్మిరి, దృష్టి మసకబారడం వంటివి ఉంటాయన్నారు. ఇలా రోగనిరోధకశక్తి వ్యవస్థ కణజాలంను దెబ్బతీస్తుందన్నారు. రెండు రోజులపాటు బెళ్ళం దూరు లోని ఎకోస్పేస్ పార్క్‌లో వాక్ ఇన్ మై షూస్ అనుభవాన్ని ఏర్పాటు చేశామ న్నారు. ముంబై, ఢిల్లీలోనూ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నరాలకు సంబంధించిన సమస్యలు పెను రోగాలకు కారణం కానుందన్నారు. ఎంఎస్ 10-20 ఏళ్ల వయస్సు కల్గినవారికి సమస్య తలెత్తుతుందన్నారు. ఎంఎస్ సొసైటీ అధ్యక్షుడు అరుణ్‌మోహన్ మాట్లాడుతూ రోగుల నికరమైన డేటాను గుర్తించేలాంటి చికిత్సలు అందించాలనేది మా ఆశయమన్నారు. మణిపాల్ ఆసుపత్రి న్యూరో స్పెషలిస్ట్ ప్రమోద్‌కృష్ణన్ మాట్లాడుతూ మల్టిపుల్ స్క్లిరోసిస్ చికిత్సలో కొత్త విధానం తీసుకొచ్చామన్నారు. బాధితులకు సకాలంలో చికిత్స లు దీర్ఘకాలంలో సమస్యలు పరిష్కరించేలా ఉంటాయన్నారు.

నారాయణలో ఏఐ ఆధారిత సేవలు

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రోగుల వివరాల పర్యవేక్షణకు నారాయణ ఆసుపత్రిలో ఏఐ ఆధారిత ఆత్మ ఐరాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏహెచ్‌పీఐఏ మాజీ చైర్మన్ డాక్టర్ అలెగ్జాండర్ థామస్, సీఏహెచ్‌ఓ జనరల్ సెక్రటరీ డాక్టర్ లలూ జోసెఫ్ తదితరులు ముఖ్యులుగా పాల్గొన్నారు. నారాయణ హెల్త్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ దేవిశెట్టి మాట్లాడుతూ బుద్ధివంతమైన ఆసుపత్రి అనేది భవిష్యత్తు పరికల్పన మాత్రమే కాలేద న్నారు. ఏఐ ఆధారిత ఆత్మ ఐరా ద్వారా ప్రతిరోగి సమాచారం తెలుసుకునే వెసలుబాటు ఉందన్నారు. సాంకేతిక నిపుణులు, డాక్టర్లు పరస్పరం కలసి పనిచేస్తారన్నారు. మెడికల్ పొరపాట్లు జరగకుండా నిలుపుదల చేసినట్టు అవుతుందన్నారు. రోగులకు సురక్షితమైన ఆరోగ్యసేవలు లభిస్తాయన్నారు. కేవలం సమాచారం సేకరించే వ్యవస్థలకు మించి సమాచారాన్ని విశ్లేషించేలా అనుసంధానం చేస్తామన్నారు. ఏఐ ఆధారిత ప్రక్రియ ఉంటుందన్నారు. కృత్రిమ మేథస్సు కొత్త అధ్యాయం అన్నారు. జగదీశ్ రామస్వామి మాట్లాడుతూ ఏఐ వైద్యరంగంలో ఏ విధంగా సేవలు అందుబాటులోకి తీసుకొస్తుందనేది కీలకం కానుందన్నారు.

సత్తాచాటిన రాష్ట్ర ప్రగతి విద్యార్థులు

పావగడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని ముగదాలబెట్ట రాష్ట్రప్రగతి విద్యార్థులు నిడిగల్ మండలస్థాయిలో జరిగినక్రీడా పోటీల్లో ప్రతిభ చాటి తాలూకా స్థాయికి ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు లక్ష్మణ్ మూర్తి తెలిపారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన ఆటల పోటీలలో వంద, 200మీటర్ల పరుగు పందెంలో ధనలక్ష్మీ మొదటి స్థానం సాధించిందన్నారు. రెండోస్థానంలో రమ్య నిలిచిందని, 1500 మీటర్ల పరుగుపందెంలో నిఖిల్ మూడోస్థానం పొందాడన్నారు. కబడ్డీ పోటీల్లో బాలికలు రెండోస్థానం పొందారని, వారు తాలూకా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.23	1627.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	55,393	37,489
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	28,711	9,488
నీటి నిల్వ (టీఎంసీలు)	77.24	83.25

అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో దుర్గా ప్రత్యంగిర మాత

కంప్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గంగావతి తాలుకా జగన్మాత దుర్గా ప్రత్యంగిర దేవాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి వివిధ పూజలు చేపట్టారు. జలాభిషేకం, అమృతాభిషేకం, కుంకుమార్చన, ఆకు పూజలు నిర్వహించారు. రజీత మంజునాథ్ పురోహితుల చేతుల మీదుగా అమ్మవారికి హోమాలు చేపట్టారు. ప్రతి అమావాస్య కొప్పళ జిల్లాతో పాటు రాయచూరు, బళ్లారి, విజయనగర జిల్లాలతో పాటు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా అమ్మవారిని దర్శించుకుని మొక్కుల్ని సమర్పించుకున్నారు.

వరదాంజనేయస్వామికి..



హోమంలో పాల్గొన్న భక్తులు

బళ్లారి రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం 5వ శనివారం సందర్భంగా మోకా మరూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూర్ణాహుతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బళ్లారి సిటీ మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనిల్ నాయుడు, కేఎస్ దివాకర్, బెస్ట్ కాలేజీ చైర్మన్ కోనంగి రామప్ప, కార్పొరేటర్ మోత్కూరు శ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలు నిర్వహించం

● వీహెచ్‌పీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి



బళ్లారి సిటీ,ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ ఏడాది జిల్లా అంతటా మహాగణపతి ఉత్సవాలు నిర్వహించడం లేదని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎక్కడా గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం లేదన్నారు. కర్ణాటక ఉత్తర ప్రావిన్స్ ఆదేశాల మేరకు వీహెచ్‌పీ మహాగణపతి ఉత్సవాలను రద్దు చేసిందన్నారు. ప్రతి సంవత్సరం రాజ్‌కుమార్‌రోడ్డులోని సెంటినరీ హాల్లో ఉత్సవాలు నిర్వహించేవారమన్నారు. జిల్లా, తాలూకాలో వీహెచ్‌పీ పేరుతో గణేశుడిని ప్రతిష్ఠిస్తే తాము బాధ్యతవహించమని ఆయన స్పష్టం చేశారు.

శ్రావణమాసం పూజలు



మార్కండేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తోరణగల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం అమావాస్య సందర్భంగా కురేకుప్ప పట్టణంలోని మార్కాండేయ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివమార్కాండేయ స్వాములకు, సీతారాములకు, విఘ్నేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

● ఎస్పీ అరుణాంషు గిరి

● 26మంది రౌడీషీటర్ల బహిష్కరణకు సిఫార్సు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ

బళ్లారి సిటీ/హొస్పేట,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో గణేశ్ చతుర్థి, ఈద్ మిలాద్ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అరుణాంషు గిరి తెలిపారు. జిల్లాలో రాత్రి 10గంటలలోపు డీజేలను నిలిపివేయాలని, ఆసమయానికి గణేశ్ నిమజ్జనం ముగించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. శనివారం హొసపేట పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో 100 మందికిపైగా రౌడీ షీటర్లతో జరిగిన కవాతు తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 26 మంది రౌడీలను బహిష్కరించడానికి సమర్పించిన ప్రతిపాదన సబ్ డివిజనల్ ఆఫీసర్ పరిశీలనలో ఉందన్నారు. మరో ఇద్దరు లేదా ముగ్గురిపేర్లు సిఫార్సు చేశారు. ఇది గౌరవ కవాతు కాదని, మీరు చెడు మార్గంలో వెళ్లి జైలు, కోర్టులకు తిరుగుతూ మీ జీవితాన్ని నాశనం చేసుకున్నారన్నారు. మీ ప్రాంతంలోని ఇతరులు అలాంటి మార్గంలో నడవకుండా వారికి తెలియజేయాలని రౌడీలకు సూచించినట్లు తెలిపారు.

అసభ్యకరమైన చిత్రాలను పంపవద్దు: ఇటీవలి రోజుల్లో మొబైల్ దుర్వినియోగం పెరిగింది. అసభ్యకరమైన చిత్రాలు, రెచ్చగొట్టే సందేశాలను పంపడం పెరిగిపోయిందని ఎస్పీ అన్నారు. రౌడీలు ఇలా చేయవద్దని సూచించారు. ప్రజలు కూడా తమ మొబైల్ వినియోగం విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. డీజేలకు బదులుగా జానపద బృందాలను ఉపయోగిస్తే పేద కళాకారులకు నెలరోజుల భృతి దొరికినట్లు అవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా దీన్ని అనుమతించేలా సూచనలు జారీ చేస్తామని ఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని 2,031చోట్ల ప్రజా గణేశ్ ఉత్సవాలు నిర్వహించాలని వినతులు వచ్చాయన్నారు. వీరిలో ఇప్పటి వరకు 600మంది నిర్ణీత ఫారంలో దరఖాస్తులు సమర్పించారని, మిగిలిన వారు 25వ తేదీ నాటికి సమర్పించాలన్నారు. లౌడ్ స్పీకర్ల వినియోగం, పర్యావరణ అనుకూల గణేశ్ విగ్రహాల వినియోగంపై ప్రభుత్వం కోర్టులు ఇచ్చిన సూచనలను జిల్లాలో ఖచితంగా అమలు చేస్తామన్నారు. ఏఎస్పీ మంజునాథ్, డీవైఎస్పీ టి.మంజునాథ్, వివిధ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శానిటరీ ప్యాడ్‌ల వాడకంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లులు

బళ్లారి సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీవాసవి విద్యాలయంలో శనివారం శానిటరీ ప్యాడ్‌ల వాడకం, పారవేయడంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఉపాధ్యాయురాలు బసవరాజేశ్వరీ మాట్లాడుతూ ప్రతి అమ్మాయి జీవితంలో నెలవారీ రుతుక్రమం ఒక సహజ ప్రక్రియ అన్నారు. ఈ సమయంలో పరిశుభ్రతను కాపాడుకోవడం చాల ముఖ్యమన్నారు. విద్యార్థినులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. శానిటరీ ప్యాడ్‌లను సరిగా ఉపయోగించాలని, పారవేయాలని సూచించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థినులకు ప్యాడ్‌ల వినియోగం, వినియోగించిన ప్యాడ్‌లను పారవేసే విధానం గురించి వివరించారు. నెలవారీ రుతు చక్రంలో పరిశుభ్రతను కాపాడుకోకపోతే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. విద్యార్థినులు శారీరక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ముందు జాగ్రత్త చర్యలను అనుసరించాలన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

● వ్యవసాయ నైపుణ్యం రోగకీటక పరిశోధకుడు పాలయ్య

కంప్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనానిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడటం వల్ల అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ నైపుణ్యం రోగకీటక పరిశోధకుడు పాలయ్య తెలిపారు. జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు జాగ్రత్తలు వహించకపోతే నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రతి రైతు పంటలు వేసుకోక ముందు తమ భూముల్ని పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం ఆ భూమికి కావలసిన ఎరువుల్ని వేయాలన్నారు. అలాగే పంట మార్పిడి వల్ల కూడా అధిక లాభాలు పొందవచ్చన్నారు. రోగ కీటక పంటలకు సోకిన సమయంలో తమ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు సంప్రదించి మందులు పిచికారి చేయాలన్నారు. పంటలు వేసిన సమయంలో పంటల్లో అధిక నీరు నిలవడం వల్ల కూడా పంటలు దెబ్బతింటాయన్నారు. పంటకు కావలసిన నీరు మాత్రమే భూమికి అందించి కాపాడుకోవాలని సూచించారు. గ్రామాల్లోని రైతులు వ్యవసాయ రంగంపైన కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే నష్టాలు తప్పవన్నారు. ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన రైతులు గ్రామంలోని రైతులకు పంటల పెంపకం విషయంలో సహకరించాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ విద్యావతి మాట్లాడుతూ జిల్లాలోని పలు గ్రామాల్లో రైతన్నలకు పంటల సాగుపై పలుసార్లు తమ కేంద్రంలో శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరు ఈ సదుపాయాలు వినియోగించుకుని వ్యవసాయ రంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి సోమశేఖర్ యోగేష్ బాబు, కవిత, నవ్య, రమేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కన్నడ భాషను పరిరక్షించాలి

● డాక్టర్ రెహమత్ తరికెరె



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రెహమత్ తరికెరె, వైద్యులు

బళ్లారి సిటీ,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కన్నడ భాషలో వైద్య సాహిత్యాన్ని పరిరక్షించాలని డాక్టర్ రెహమత్ తరికెరె అన్నారు. శనివారం నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డు బీపీఎస్సీ స్కూల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కన్నడ మెడికల్ రైటర్స్ కమిటీ నిర్వహించిన రెండు రోజుల 6వ కన్నడ మెడికల్ రైటర్స్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కన్నడ స్టేట్ బ్రాంచ్, కన్నడ మెడికల్ రైటర్స్ అసోసియేషన్ సంయుక్తంగా వైద్య సాహిత్యం-జానపద సాహిత్యం అనే థీమ్‌తో 6వ రాష్ట్ర సదస్సును బళ్లారిలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇది యువ వైద్య రచయితలు కన్నడ సాహిత్య సాగులో పాల్గొనడానికి దోహదపడుతుందన్నారు. రోజువారీ వృత్తి ఒత్తిడి మధ్య కూడా సాహిత్య సాగు జరుగుతుండటం ప్రశంసనీయమన్నారు. రెండురోజుల కార్యక్రమంలో మెదటి రోజున 50మందికిపైగా వైద్యులు కవితా పఠనంలో పాల్గొన్నారు. రాత్రి బయలాట, జ్యోతి కుణిత తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సర్జన్, కన్నడ వైద్య సాహిత్య రచయిత డాక్టర్ అరవింద్ పటేల్, వైద్యులు పాల్గొన్నారు.

కర్ణాటక జర్నలిస్టు సంఘం సభ్యులకు సన్మానం



ఎన్నికైన పదాధికారులను సన్మానిస్తున్న సంఘం

గంగావతి, అగస్టు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ గంగావతి తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా చెన్నబసవ, కోశాధికారిగా దేవదానం ఇతరసభ్యులను రాష్ట్ర సంఘ శనివారం అభినందించింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రాజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ద్వారా ఎన్నుకోవడం సరైనదేనన్నారు. రాష్ట్ర సంఘం మార్గదర్శకత్వంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లికార్జున, కొప్పళ జిల్లా అధ్యక్షుడు రమేశ్ సలహాతో రాబోయే రోజుల్లో అందరినీ కలుపుకుని సంఘాన్ని ముందుకు తీసుకెళతామన్నారు. అసోసియేషన్ మరోసారి మంచి కార్యకలాపాలతో మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటానన్నారు. కర్ణాటక మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ పదాధికారులు పాల్గొన్నారు.

వరద ప్రవాహం తగ్గు ముఖం

రాయచూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దులో కృష్ణానదిపై ఉన్న నారాయణపూర్ జలాశయం నుంచి నీటి విడుదల క్రమేపి తగ్గుముఖం పడుతున్నట్లు జిల్లాధికారి కే నితీశ్ తెలిపారు. శనివారం జిల్లాధికారి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన మేరకు నారాయణపూర్ ఔట్‌ఫ్లో 2.65 లక్షల క్యూసెక్కుల నుంచి 2.10 లక్షల క్యూసెక్కులకు కుదించారు. ఆల్మట్టి జలాశయం నుంచి వస్తున్న నీటి ఆధారంగానే జలాశయం ఔట్‌ఫ్లో ఆధారపడి ఉంటుందని వివరించారు. జిల్లా సరిహద్దులో కృష్ణా నది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా రుద్రప్ప తాత రథోత్సవం

కంప్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సిరిగేరి సమీపంలోని కొంచిగేరి గ్రామంలో గురువారం నుంచి శనివారం వరకు రుద్రప్ప తాతకు ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం రుద్రప్ప తాత రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. కొంచిగేరి పరిధిలోని గ్రామాల్లో భక్తులు రథోత్సవంలో పాల్గొని పూలు, పండ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవాన్ని ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు ఊరేగించారు.

అల్లీపుర మఠంలో పూజలు



పూజల్లో పాల్గొన్న కాపు రామచంద్రారెడ్డి దంపతులు

బళ్లారి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికైన నేపథ్యంలో శనివారం బళ్లారిలోని అల్లిపురం మఠంలో కాపు రామచంద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అభిమానులు సన్మానించారు. కార్యక్రమంలో కాపు భారతి, కాపు ప్రవీణ్‌కుమార్, వన్నూరుస్వామి, తిమ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సురేష్ యాదవ్, ఖాసింపీరా పాల్గొన్నారు. అనంతరం కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనకు ఎంతో బాధ్యతగా అప్పగించిందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం శ్రమించి కార్యకర్తలకు అండగా వుంటానని తెలిపారు.

బళ్లారి జిల్లా అభివృద్ధికి బీడీసీసీఐ కృషి



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ తుకారం తదితరులు

బళ్లారి సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వతోముఖాభివృద్ధి, ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు ఎంపీ తుకారం నాయకత్వంలో జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, పన్ను కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్ కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రులు, సీనియర్ అధికారులను కలిసి వినతిపత్రాన్ని సమర్పించి చర్చలు జరిపారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి, ముంబయి, కొల్హాపూర్ రైల్వే లైన్‌ను బళ్లారి వరకు పొడిగించడం, పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి బళ్లారిలో విమానాశ్రయ నిర్మాణం,పర్యావరణ నియంత్రణ బోర్డు అధికారులతో చర్చించారు. కుడతిని పారిశ్రామిక ప్రాంతానికి అనుమతి ఇవ్వాలని పర్యావరణ శాఖకు లిఖితపూర్వక అభ్యర్థనలు సమర్పించారు. సత్వర చర్యలు తీసుకోవాలని వారిని అభ్యర్థించారు. యశ్వంత్ రాజ్ నాగిరెడ్డి మంత్రులు అధికారులతో సమావేశమై చర్చలు జరిపి జిల్లాలో సమగ్ర అభివృద్ధి, వాణిజ్య అభివృద్ధి, ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోండి



రోగులకు మందుల కిట్లను పంపిణీ చేస్తున్న గ్రామ పంచాయతీ అధ్యక్షుడు నాగరాజు

కంప్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు గ్రామాల్లోని ప్రజలకు ఇచ్చే ఆరోగ్య చికిత్స సదుపాయాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం పరచుకోవాలని గ్రామ పంచాయతీ అధ్యక్షుడు గంటా నాగరాజు కోరారు. శనివారం సిరిగేరి సమీపంలోని కొంచిగేరి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో గృహ ఆరోగ్య పథకం కింద ప్రజలకు మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ శాఖ అధికారి నగేష్, హెల్త్ ఆఫీసర్ వెంకటేశులు, గ్రామ పంచాయతీ సభ్యులు లింగప్ప రాజన్న, కూనప్ప ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవజాత శిశువు మొండెం లభ్యం

రాయచూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మస్కి పట్టణంలో శనివారం ఉదయం తల లేని మొండెంతో నవజాత శిశువు లభించింది. మస్కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుకభాగంలో మొండెం పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు, నగరసభ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న అధికారులు శిశువు దేహాన్ని ఆస్పత్రికి అప్పజప్పి శిశువుకు సంబంధించిన తల్లిదండ్రులు, బంధువుల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

పోలీసులకు చిక్కిన దొంగలు



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

రాయచూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగదు తీసుకెళుతున్న వ్యక్తి దృష్టి మళ్లించి రూ.3,30,000 కాజేసిన ఇద్దరు దొంగలను శనివారం సింధనూరు రూరల్ పోలీసులకు పట్టుబడ్డారు. సింధనూరు బంగార క్యాంప్‌కు చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి 17వ తేదీన బ్యాంకు నుంచి రూ.3,30,000 తీసుకుని వెళుతుండగా ముగ్గురు దుండగులు వెంబడించారు. మార్గమధ్యలో పళ్ల దుకాణం వద్ద ఆగి సత్యనారాయణ వాటిని కొనుగోలు చేస్తున్న సందర్భంలో ఆయన దృష్టి మరల్చిన దుండగులు బైక్ సైడ్ బ్యాగులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో రమేశ్ కుమార్ జాదవ్, వేణుగోపాల్ పట్టుబడగా మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హొసూరు జోన్

ఆడియమాన్ విద్యాసంస్థకు ప్రత్యేక అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆడియమాన్ ఎడ్యుకేషన్ గ్రూప్ ట్రస్టీ ఇలాసియా తంబిదురై

హొసూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తమిళనాడు సమాచారశాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ సమక్షంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆడియమాన్ ఎడ్యుకేషనల్ గ్రూప్ ట్రస్టీ డాక్టర్ ఇలాసియా తంబిదురైకు ఐసీటీ అకాడమీ నెక్స్ట్ జనరేషన్ ఎడ్యుకేటర్ అవార్డులను ప్రదానం చేశారు. అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా విద్యావాతావరణం రూపొందించడం, విద్యారంగంలో దార్శనికత నాయకత్వం కోసం అవార్డును ప్రదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఆడియమాన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణన్ ఎంజీఆర్ అవార్డును అందచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముత్తుమణి, అకడమిక్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సురేశ్‌బాబు, వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ వెంకటేశ్ సెల్వం, మేనేజర్ నారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



శిబిరంలో ప్రజల సమస్యలను ఆలకిస్తున్న ఎమ్మెల్యే

హొసూరు (కృష్ణగిరి), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'మీతో స్టాలిన్ ప్రాజెక్టు' పేరిట జిల్లా వ్యాప్తంగా శిబిరాలు సాగాయని ఎమ్మెల్యే ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. హొసూరు పంచాయతీ యూనియన్ బాగలూరు ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీ స్కూల్‌లో ఏర్పాటైన శిబిరంలో ప్రజల సమస్యలను ఆలకించారు. శాఖలవారీగా ప్రజల వినతులను కంప్యూటరీకరణ చేశారు. ప్రజలనుంచి స్వీకరించిన వినతిని 45రోజులలోగా పరిష్కారం అవుతుందన్నారు. ప్రతి శిబిరంలో ఇ-సేవా కేంద్రం, ఆధార్ కేంద్రం, ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్యబీమా కార్డు పొందే సేవలతోపాటు పలు సదుపాయాలు కల్పించారు. శిబిరంలో నిర్వాహకులు గజేంద్రమూర్తి, మురళిబాబు, నాగరాజ్, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూలధరలు పెరగడంపై రైతుల హర్షం



మార్కెట్‌లో పూల విక్రయాలు

హొసూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నేపథ్యంలో హొసూరు పూల మార్కెట్‌లో పూల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ధరలు పెరగడంతో పూలరైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. కనకాంబరం కిలో రూ.1200, గుండుమల్లి కిలో రూ.వెయ్యి, బంతిపూలు రూ.160, గులాబీ రూ.120-160 దాకా, సంపంగి రూ.200 ధరలు పలికాయి.